
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

బుధవారం 3 సెప్టెంబరు 2025

ఈనెల 7న మల్లన్న ఆలయం మూసివేత

కొమురవెల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 7న ఆదివారం మధ్యాహ్నం 1 నుంచి మహానివేదన అనంతరం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆలయాధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు ఉదయం ఆలయ సంప్రోక్షణ తర్వాత ప్రాతఃకాల పూజల అనంతరం ఉదయం 6 గంటల నుంచి దర్శనాలు, అర్జిత సేవలు కల్పిస్తామని అధికారులు, అర్చకులు తెలిపారు.

రూ. 500కోట్లతో మహబూబ్‌సాగర్ చెరువు సుందరీకరణ

సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలో శంకుస్థాపన

కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి సమీక్ష నిర్వహించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి



సంగారెడ్డిలో మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య



మహబూబ్‌సాగర్ సుందరీకరణపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి, కలెక్టర్‌కు వివరిస్తున్న హెచ్‌ఎండీఏ అధికారులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువును రూ.500 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య, నిర్మలా జగ్గారెడ్డి, జగ్గారెడ్డిలకు హెచ్‌ఎండీఏ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మల, జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చెరువు మధ్యలో రూ.20 కోట్లతో భారీ శివుడి విగ్రహం ఏర్పాటు, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, వాచ్ టవర్ ఏర్పాటు. బయట నుంచి వచ్చే డ్రైనేజీ నీరు చెరువులో కలువకుండా ప్రత్యామ్నాయంగా డ్రైనేజీ నిర్మాణం. రానున్న ఇరవై ఐదు సంవత్సరాలకు సరిపోయేలా 23.5 ఎంఎల్‌డీఈ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ డిజైన్ రూపకల్పన. మహబూబ్‌సాగర్‌ను టూరిజం, రిక్రియేషన్ సెంటర్‌గా మార్చేలా ప్రాజెక్టుకు రూపకల్పన. నేషనల్ హైవే, ఐబీటీ నుంచి మహబూబ్‌సాగర్ వరకు వంద ఫీట్ల లింకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు. ప్రాజెక్టు రెండో దశలో రూ. 65కోట్లతో డీసిల్టింగ్ చేసేలా ప్రణాళికలు. చెరువు మధ్యలో ఉన్న సోమేశ్వర ఆలయం రూ. 9కోట్లతో అభివృద్ధి. మహబూబ్‌సాగర్ కట్ట వెడల్పు, సైకిల్ ట్రాక్, రెండు లైన్ల బీటీ రోడ్ నిర్మాణం. ప్రాజెక్టు రెండో దశలో ఐలాండ్‌లు, వాటర్ థీమ్ పార్కు, బోటింగ్ డెక్ ఏర్పాటు. రూ. 9కోట్లతో బతుకమ్మ ఘాట్, చిల్డ్రన్ ప్లే ఏరియా నిర్మాణం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు. మహబూబ్‌సాగర్ అభివృద్ధిలో భాగంగా రైతుల నుంచి సేకరించే భూమి విలువను మార్కెట్ ధరను పరిగణలోకి తీసుకోవాలని ఆర్డీవోకు జగ్గారెడ్డి సూచన. నిధులు లేకుంటే తన సొంత డబ్బులు రూ.50లక్షలతో పట్టణం డ్రైనేజీ నీరు చెరువులో కలువకుండా సోమేశ్వర ఆలయం చేరుకునేలా రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు కలెక్టర్ ప్రావీణ్యకు జగ్గారెడ్డి వివరించారు.

గణపయ్య నిమజ్జనానికి గ్రహణం ఎఫెక్ట్

- ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం
- శనివారంలోపే పూర్తి చేయాలంటున్న పండితులు



పూజలందుకుంటున్న గణనాథుడు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 2 : ఈ ఏడాది వినాయక నిమజ్జనంపై సందిగ్ధం నెలకొన్నది. ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సెప్టెంబరు 7న భాద్రపద పౌర్ణమి నాడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. ఈ గ్రహణం ఆదివారం రాత్రి 9:56 నిమిషాలకు ప్రారంభమై అర్ధరాత్రి 1:56 నిమిషాలకు ముగుస్తుంది. గ్రహణం ప్రభావం నిమజ్జన క్రతువుపై పడకుండా ఉండాలంటే శనివారంతోనే నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలని పండితులు సూచిస్తున్నారు.

నిమజ్జనానికి సరైన సమయం..

సాధారణంగా నవరాత్రుల తర్వాత 10వ రోజున నిమజ్జనం చేయడం ఆచారం. అయితే ఈసారి గ్రహణం కారణంగా, నవరాత్రులు పూర్తయ్యే గురువారం (సెప్టెంబరు 4) తర్వాత శుక్ర, శనివారాల్లో నిమజ్జనం పూర్తి చేయడం ఉత్తమమని పండితులు చెబుతున్నారు.

గ్రహణ సమయంలో ఎందుకు చేయకూడదు?

సూర్య, చంద్ర గ్రహణాలు ఏర్పడినపుడు ఆలయాలను మూసేసి గ్రహణం తర్వాత సంప్రోక్షణ చేస్తారు. మట్టితో చేసిన గణపతి విగ్రహాలను కూడా మూలమూర్తులుగా భావిస్తారు. కలశ , మండప ఆరాధనపై గ్రహణ ప్రభావం పడకూడదని శాస్త్రం చెబుతోంది. తొమ్మిది రోజుల పూజల తర్వాత గ్రహణ సమయం వరకు గణపతిని ఉంచడం వలన ఆ పూజల ఫలితం ఉండదని, అలాగే ఎక్కువ రోజులు గణనాథుడిని మండపంలో ఉంచడం శాస్త్ర విరుద్ధమని పండితులు హెచ్చరిస్తున్నారు.

సిద్దిపేటలో నిమజ్జన ఏర్పాట్లు

జిల్లాలో మొత్తం 3008 వినాయక మండపాలను ఏర్పాటు

మిగతా 8వ పేజీలో

ఈ నెల 9 నుంచి రాష్ట్రస్థాయి

సివిల్ సర్వీస్ క్రీడలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనే ఔత్సాహిక ఉద్యోగులు ఈనెల 9వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా క్రీడలు యువజన అధికారి జంగపల్లి వెంకట నర్సయ్య తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు ఈనెల 9, 10న హైదరాబాద్‌లోని పలు స్టేడియాల్లో జరగనున్నాయి. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్ ఫుట్‌బాల్, హాకీ, లాన్‌టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, రెజ్లింగ్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ క్రీడాంశాల్లో ఎంపికలు జరగనున్నాయి. ఈ ఎంపికల్లో పాల్గొనే జిల్లాలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా స్పోర్ట్స్ అథారిటీని సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8522821102, 9052025009 నెంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ

సీసీ కెమెరాలతో

నేరాల నియంత్రణ : సీపీ

దౌల్తాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టడంతో పాటు దొంగతనాలకు పాల్పడిన నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర వహిస్తాయని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసిన 16 సీసీ కెమెరాలను మంగళవారం గజ్వేల్ ఏసీపీ నర్సింహులుతో కలిసి గ్రామపంచాయతీలో ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దౌల్తాబాద్ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చిన ఎస్ఐ అరుణ్‌కుమార్‌ను సీపీ అభినందించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కాసేపు పిల్లలతో గడిపారు. ఆయా కార్యక్రమాల్లో తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్, తొగుట ఎస్ఐ రవికాంత్ రావు, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వ్యాపారులు, పలువురు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

స్థానిక, పంచాయతీ ఓటర్ల తుది జాబితా రెడీ

- పోలింగ్ కేంద్రాల వివరాలు వెల్లడి
- ఇక నోటిఫికేషనే తరువాయి
- గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం
- ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు



సిద్దిపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల తుది ఓటరు జాబితాను ప్రకటించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల సంఖ్య లెక్క తేల్చారు. గ్రామపంచాయతీ పాలకవర్గాలు, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. నిరీక్షణకు తెరదించుతూ ఈ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే ఊహాగానాలు వస్తున్నాయి. ఈమేరకు మూడు జిల్లాల్లో ఓటరు తుది జాబితా ప్రకటించడంతో రిజర్వేషన్లు, నోటిఫికేషన్లపై ఆసక్తి నెలకొంది.

కొన్ని ఇన్.. మరికొన్ని అవుట్

సంగారెడ్డి జిల్లా నిజాంపేట, చౌటకూరు, సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట, కుకునూరుపల్లి, మెదక్ జిల్లా మాసాయిపేట మండలాల్లో తొలిసారిగా మండల పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. 2019వ సంవత్సరంలో స్థానిక ఎన్నికలు జరిగే సమయానికి ఈ మండలాలను ఏర్పాటు చేయలేదు. మరోవైపు గత ఎన్నికల సమయంలో మండల పరిషత్‌లుగా కొనసాగిన జిన్నారం, అమీన్‌పూర్ మండలాల్లోని గ్రామాలను పూర్తిగా మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు మాత్రమే జరుగుతాయి. పటాన్‌చెరు మండలంలోని గ్రామాలతో ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలను ఏర్పాటు చేసినప్పటికీ చివరి క్షణంలో 3 గ్రామాలను విభజించి పటాన్‌చెరు మండల పరిషత్‌ను అలాగే ఉంచారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల పరిధిలో 5 ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ, జడ్పీటీసీ ఉండబోతున్నారు.

తప్పుల సవరణ అంతంతే..

ఓటరు జాబితాల్లో అనేక తప్పులు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కానీ, అధికారులు మాత్రం తప్పులను పూర్తిగా సవరించకుండానే తుది జాబితాలను ప్రకటించడం గమనార్హం. జాబితాల్లో చనిపోయిన వారు ఉండడమేగాకుండా ఒక్కొక్కరి పేరిట ఒకటికి మించి

మిగతా 6వ పేజీలో

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓటర్ల వివరాలు

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం	కేంద్రాలు
సంగారెడ్డి	3,75,843	3,68,270	7,44,157	5,370
సిద్దిపేట	3,34,186	3,21,766	6,55,958	4,508
మెదక్	2,71,787	2,51,532	5,23,327	4,220

పంచాయతీలు, పరిషత్‌ల వివరాలు

జిల్లా	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	పంచాయతీలు	వార్డులు
సంగారెడ్డి	261	25	613	5,370
సిద్దిపేట	230	26	508	4,508
మెదక్	190	21	492	4,220



'ఇందిరమ్మ'కు హైటెన్షన్ కష్టాలు

దుబ్బాక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ హైటెన్షన్ వైర్లు పెద్ద అడ్డంకిగా మారాయి.

2013లో ఇక్కడ సుమారు 372 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వారిలో 72 మంది సొంత ఖర్చుతో ఇళ్లను కట్టుకుని కేసీఆర్‌కాలనీగా ఏర్పాటు చేసుకున్నారు. మరో 32 మందికి డబుల్ ఇళ్లు నిర్మించి హరీశ్‌రావు కాలనీ పేరుతో ఇచ్చారు. మిగిలిన రెండు వందల మందికి పైగా నిరుపేదల్లో 20 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వారు పునాదులు వేసిన తర్వాత పనులు ఆగిపోయాయి. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తుండగా, హైటెన్షన్ వైర్ల సమస్యతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ సమస్య గురించి విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చేర్యాలలో ఎదుగుదల కోల్పోయిన పత్తిచేను

ఎర్రబారుతున్న పత్తి చేలు..

చేర్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంతంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి చేలు ఎర్రబారిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పత్తి చేలలో నీరు నిలిచిపోవడం, తడి ఆరిలోపే మళ్లీ వర్షాలు పడటంతో మొక్కల ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. ఈ సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులు, ఇప్పుడు అధిక వర్షాల కారణంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితికి తోడు, పంటలకు అవసరమైన యూరియా కొరత రైతుల సమస్యలను మరింత పెంచుతోంది. యూరియా కోసం రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది. దీంతో, పంటలను కాపాడుకోవడానికి తగినంత సమయం కేటాయించలేకపోతున్నామని వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చేర్యాలలో ఎర్రబారుతున్న పత్తి మొక్కలు

ఆబ్సెంట్ సార్..

- తిమ్మాపూర్, అనంతసాగర్ పాఠశాలల్లో పడిపోయిన హాజరుశాతం
- చికిత్స పొందుతున్న దాదాపు 150 మంది విద్యార్థులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. రెండు గ్రామాల పరిధిలో దాదాపు 150 మంది విద్యార్థులు విష జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. 30 మందికిపైగా విద్యార్థులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో, మిగిలిన వారు వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఫలితంగా ఆ రెండు గ్రామాల్లోని పాఠశాలల్లో హాజరు 35 శాతానికి పైగానే పడిపోయింది. తిమ్మాపూర్‌లోని ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో కలిపి 193 మంది విద్యార్థులు ఉండగా కేవలం 80 నుంచి 90 మంది మాత్రమే హాజరవుతున్నారు. ప్రతి రోజు 100 నుంచి 110 మంది విద్యార్థులు గైర్హాజరవుతున్నారు. విష జ్వరాలతో బాధపడుతుండడం వల్లే పాఠశాలకు వెళ్లడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. తాజాగా తిమ్మాపూర్ గ్రామంలో మరో ముగ్గురికి డెంగ్యూ లక్షణాలు కనిపించడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ కిరణ్ తెలిపారు.



గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు చిన్నారులు

గజ్వేల్ ఆసుపత్రిలో చేర్చుకోవడం లేదు



విష జ్వరాలతో బాధపడుతుంటే ఆసుపత్రిలో చేర్చుకోవడం లేదు మా కూతురు మోక్షిత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా గజ్వేల్‌కు తీసుకువచ్చాను. మూడు రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఇంకా జ్వరం తగ్గలేదు. అయినా ఇంటికి తీసుకెళ్లమంటున్నారు. మూడు రోజులుగా నాకు తీవ్రమైన జ్వరం వచ్చింది ఆసుపత్రిలో చేర్చుకొని చికిత్స అందించాలని డాక్టర్లను కోరుతున్నా చేర్చుకోవడంలేదు. డెంగ్యూ ఉన్నట్లు రిపోర్ట్ తెమ్మంటున్నారు. లేదంటే ఎవరితోనైనా చెప్పించాలంటున్నారు.

- దండు కుమార్ తిమ్మాపూర్



గజ్వేల్ బస్తీ దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్

డెంగ్యూ కేసులతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హైమావతి

గజ్వేల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ కేసులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. గజ్వేల్‌లోని బస్తీ దవాఖానను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీపీ చెక్ చేయించుకోగా నార్మల్ ఉంది. మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు పొందారు. అనంతరం వైద్యసేవలపై డాక్టర్ గౌతమిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, మెడిసిన్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. డెంగ్యూతో అప్రమత్తంగా ఉండాలని, చాలా రోజుల పాటు జ్వరం ఉంటే డెంగ్యూ టెస్టులు చేయించాలని సూచించారు. ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ రాగా ప్లేట్లెట్ కౌంట్ లక్ష కంటే తక్కువగా ఉండడంతో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఆమె వెంట డాక్టర్ గౌతమి, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట/దుబ్బాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆయా వార్డుల్లో తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట, దుబ్బాక మున్సిపల్ కమిషనర్లు ఆశ్రిత్‌కుమార్, రమేష్ కుమార్ సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పర్యటించారు. ఈ మేరకు పలు ఇళ్ల ముందున్న నీటి తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలలో నిలిచిన నీటిని గమనించి తొలగింపచేశారు. పట్టణంలో ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దుబ్బాక మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో డ్రై డే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ ప్రజలకు పలు సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ పారిశుధ్య పనులు, ఫాగింగ్‌ను పరిశీలించారు.

కల్వర్టులు.. కష్టాలు

- వరదొస్తే లో లెవల్ వంతెనలు దాటలేని పరిస్థితి
- రోజులతరబడి రాకపోకలు బంద్

7

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

7



నెలలోపే నవ వధువు బలవన్మరణం

● వారం నుంచే భర్త వేధింపులు


రాధిక (ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్త జీవితంపై కోటి ఆశలతో అత్తింట్లో అడుగు పెట్టిన నవ వధువు.. నమ్మి వచ్చిన తనను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన భర్తే వేధించడంతో తట్టుకోలేక పోయింది. కాళ్ల పారాణి ఆరక ముందే.. పెళ్లయిన నెల లోపే నవ వధువు తనువు చాలించిన ఘటన మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్ర వాసి వారనాసి రాధిక (19) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అమ్మమ్మ లక్ష్మి.. మనుమరాలిని పెంచి పెద్ద చేసింది. గత నెల ఒకటో తేదీన మండల కేంద్ర వాసి వారనాసి కుమార్‌కిచ్చి పెళ్లి చేసింది. పెళ్లయిన తొలివారం భార్యాభర్తలు సంతోషంగానే ఉన్నా.. ఆ తర్వాత రాధికను శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆమె ఈ సంగతి తన అమ్మమ్మకు చెప్పుకుంది. పంచాయతీలో పెద్ద మనుషులు వైఖరిని మార్చుకోవాలని కుమార్‌కు నచ్చజెప్పినా అతడి వైఖరిలో మార్పు రాలేదు. దీంతో మనో వేదనకు గురైన రాధిక.. మంగళవారం ఇంట్లోనే ఉరేసుకుంది. తల్లిదండ్రులేని మనుమరాల్ని కంటికి రెప్పలా పెంచి పెద్ద చేసి.. పెళ్లి చేసిన నెల లోపే రాధిక తనువు చాలించడంతో అమ్మమ్మ కన్నీరుమున్నీరవుతోంది. అమ్మమ్మ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణగౌడ్ తెలిపారు.

ఆశ చూపి లక్షల్లో టోకరా

పటాన్‌చెరు సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్‌లో వచ్చిన పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్‌కు ప్రైవేట్ ఉద్యోగిని, అమెజాన్ ఉత్పత్తులు రైజింగ్ చేస్తే కమీషన్ ఇస్తామంటూ ఓ వ్యక్తిని ఆశ చూపించి మోసం చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం నవ్యకాలనీలో నివాసం ఉంటున్న రవీందర్‌రెడ్డి పాశమైలారం ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆగస్టు 25వ తేదీన ఫోన్‌లో టెలిగ్రామ్‌కు హాయ్ అని పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తే లాభాలు గడించవచ్చంటూ మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేసి మ్యాప్స్‌కి రివ్యూలు చేస్తే డబ్బులు ఇస్తామన్నారు. ఇందుకు డిపాజిట్ చేయాలన్నారు. ప్రతి టాస్క్‌కు రూ.10వేలు చొప్పున ఆన్‌లైన్ ఖాతాలో వేశారు. రూ.3.75లక్షలు జమ చేశారు. లాభాలతో కలిపి రూ.4.2లక్షలు ఉండటంతో వెనక్కి తీసుకోబోతుండగా అవి రావాలంటే మరో రూ.2.5 లక్షలు వేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో అనుమానం వచ్చి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాలుగు వందల లాభం చూపించి..

వందల్లో లాభం చూపించి రూ.లక్షలు కొల్లగొట్టిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధి సాయినగర్‌లో నివాసం ఉంటున్న చౌహాన్ సంతోష్ డాక్యుమెంట్ రైటర్‌గా జూబ్లీహిల్స్‌లో పని చేస్తున్నాడు. ఆగస్టు 9న ఫోన్‌కు అమెజాన్ ఉత్పత్తులు రైజింగ్ చేస్తే కమీషన్ ఇస్తామంటూ ఆశ చూపారు. ముందుగా గుర్తుతెలియని వ్యక్తులు సూచించిన ఆన్‌లైన్ ఖాతాలో వెయ్యి రూపాయలు వేశాడు. ఇందుకు నాలుగు వందల 40 రూపాయలు లాభం చూపించారు. ఇలా మరిన్ని లాభాలు ఆర్జించవచ్చంటూ వరసగా రూ. 44వేలు, రూ.36వేలు, 60, 90 వేలు చొప్పున డబ్బులు వేస్తూ వెళ్లారు. అలా రూ.8,95,530లు ఖాతాలో వేశారు. లాభంతో కలిపి రూ.12.4లక్షలు రావాల్సి ఉంది. వాటిని వెనక్కి తీసుకునే సమయంలో మరిన్ని డబ్బులు వేయాలంటూ కోరడంతో అనుమానం వచ్చింది. సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నిధుల దుర్వినియోగం చేసినట్లు సోషల్ ఆడిట్‌లో తేలితే ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తప్పవని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ద్వారా వ్యాధుల నిర్మూలన దిశగా ముందుకెళ్తున్నామన్నారు. ప్రజలు చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడకుండా పటిష్ఠ కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీల భవన నిర్మాణాలు ప్రారంభించాలని, స్థానిక సంస్థ ఎన్నికలకు సర్వం సిద్ధం కావాలన్నారు.

వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

హవేళిఘణపూర్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పోచమ్మరాల్ గ్రామశివారులో పోచారం డ్యాం నీటి ఉధృతికి మెదక్ - బోధన్ రహదారి కొట్టుకుపోగా చేస్తున్న పునరుద్ధరణ పనులు, డ్యాం వద్ద ఉన్న నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు రావద్దని, ఈ విషయంలో అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

వట్‌పల్లి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామంలో 6 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లవకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన గడ్డమీది రాములు పత్తి పంటలో ఆరు గంజాయి మొక్కలను సాగుచేసినట్లు వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'నల్లవాగు' పర్యాటక అభివృద్ధిపై సమీక్ష


కల్హేర్ తహసీల్దార్ కార్యాలయంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టునుమంగళవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ అధికారులు పరిశీలించారు. నల్లవాగు ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన ప్రదేశాలను రాష్ట్ర పర్యాటక అభివద్ధి కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ వైఆర్‌కె రాజు, కనసల్టేషన్ ప్రవీణ్, డీఈ నటరాజ్‌లు పరిశీలించారు. అనంతరం కల్హేర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి నల్లవాగు ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన పర్యాటక అభివృద్ధి పనుల గురించి సమీక్ష నిర్వహించారు.

టూరిజం కేంద్రాలుగా ఏర్పాటు చేయాలి

మనూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మనూరు మండలంలోని కమలాపూర్ చెరువు, బోరంచ మంజీరా నది పరివాహక ప్రాంతాలను టూరిజం కేంద్రాలుగా ఏర్పాటు చేయడాన్ని అధ్యాయనం చేస్తున్నామని టూరిజం ప్రాజెక్టు మేనేజర్ వై.ఆర్.కే రాజు, డీఈ నటరాజ్, బోటింగ్ మేనేజర్ ప్రభుదాస్, ఏఎం బూదయ్య అన్నారు. మంగళవారం కమలాపూర్ చెరువు, బోరంచ మంజీరా పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని అధికారులతో మాట్లాడుతూ బోరంచ, కమలాపూర్ చెరువులను టూరిజం కేంద్రాలుగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు.

మున్సిపాలిటీ సిబ్బందిపై అనుచిత ప్రవర్తన

దుబ్బాక, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఇంటి కొలతలు తీసుకునేందుకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకపరిచిన ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదైంది. నెల రోజుల క్రితం పట్టణంలోని 14వ వార్డులో మర్గల రత్నాకర్ అనే ఆర్‌ఎంపీ వైద్యుడికి చెందిన కొత్త ఇంటికి సంబంధించి కొలతలు తీసుకునేందుకు మున్సిపల్ సిబ్బంది రెండుసార్లు అక్కడికి వెళ్లగా, ఇంటి యజమాని రత్నాకర్ వారిని దూషిస్తూ, ఇంటి కొలతలు తీసుకోకుండా అడ్డుపడి, అక్కడి నుంచి పంపించేశాడు. దీంతో మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, తన సిబ్బందితో కలిసి స్వయంగా కొలతలు తీసుకునేందుకు వెళ్లగా, మరోసారి కమిషనర్‌తో అనుచిత వాక్యాలు చేస్తూ, దురుసుగా ప్రవర్తించాడు. దీంతో మంగళవారం దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఆర్‌ఎంపీ వైద్యుడు రత్నాకర్‌పై ఫిర్యాదు చేయగా, దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్య, ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, అతని అంత్యక్రియలకు హాజరై చెరువులో స్నానానికి వెళ్లి కాలుజారి చెరువులో నీట మునిగి మరో యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం లింగారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్(36)కు ఇద్దరు భార్యలున్నారు. పెద్ద భార్య పద్మ హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. కుటుంబ పోషణ కష్టమై ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో ఇంట్లో మదనపడేవాడు. సోమవారం రాత్రి లింగారెడ్డిపల్లిలోని ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిక్కుడు శ్రీనివాస్ అంత్యక్రియలను మంగళవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు లింగారెడ్డిపల్లికి చెందిన అతడి బంధువు రాజు హాజరై బస్వారెడ్డి కుంటలో స్నానానికి వెళ్లాడు. కుంటలోకి దిగిన రాజు నీటమునిగాడు. వెంటనే పక్కనున్నవారు వెతికినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే జగదేవ్‌పూర్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి కొందరి సహాయంతో కుంటలోకి దిగి గాలించినా ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కోహీర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో జరిగింది. కోహీర్ ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మయ్య (50) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఆగస్టు 31వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మయ్య అదే రోజు గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గజ ఈతగాళ్లు శవాన్ని బయటికు తీసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కొడుకు మానేయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఎన్నికలకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

ఫొటోలు, వివరాలు ఉన్నాయి. భార్యాభర్తల చిరునామాలు వేర్వేరుగా ఉన్నాయి. ఒక ఊరి ఓటరు పేరు మరో ఊరిలో వచ్చిన విశేషాలు కనిపించాయి. కొన్నిచోట్ల పేర్లు హిందీలో నమోదయ్యాయి. కొన్ని వివరాలను సరిదిద్దినా ఇంకా చాలా పెండింగులోనే ఉన్నాయి. త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో ఆదరాబాదరాగా తుది జాబితాను విడుదల చేశారు.

పల్లెల్లో జోరుగా చర్చ

పల్లెల్లో ఎక్కడ చూసినా స్థానిక ఎన్నికలపైనే చర్చ జరుగుతున్నది. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావహులు రెండేళ్లుగా ప్రయత్నాలు చేసుకుంటున్నా.. ఎన్నికలు వాయిదా పడుతుండటంతో ఉసూరుమంటున్నారు. ఎట్టకేలకు ఓటరు జాబితా వెలువడటంతో ఆశలు చిగురించాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్.. కనీసం వార్డుసభ్యుడిగానైనా బరిలోకి దిగి ఉప సర్పంచ్ పదవినైనా చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఏదో ఒకదానికి రిజర్వేషన్ కలిసిరాకపోదా అని ఎదురు చూస్తున్నారు. అందుకే ఈసారి చాలా గ్రామాల్లో ఆశావహులే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయించడమేగాకుండా చందాలు కూడా విరివిగా ఇచ్చారు.


















కొండపాకలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



శివ్వంపేటలో అర్ధరాత్రి నుంచి క్యూలో రైతులు

బారుల బాధలు తీరేదెన్నడో?

శివ్వంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిమంది రైతులు సోమవారం రాత్రి ఒంటి గంట నుంచే పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం క్యూలో నిలబడ్డారు. ఒక సంవత్సరం వయసున్న తన కొడుకుతో ఒక మహిళ యూరియా కోసం క్యూలో ఎదురుచూడడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. పీఏసీఎస్‌కు కార్యాలయానికి 850 యూరియా బస్తాలు రాగా, వాటిని రైతులకు పంపిణీ చేసినట్లు ఏవో లావణ్య, సీఈవో మధు యాదవ్ తెలిపారు.

- తొగుట : తొగుట ఆగ్రోస్ దుకాణానికి 1350 యూరియా బస్తాలు రాగా, రైతులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. అందరికీ సరిపోకపోవడంతో రైతులు ఆందోళన చేశారు.
- చిన్నశంకరంపేట : మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద పోలీసులు బందోబస్తు మధ్య యూరియాను విక్రయించారు. పంపిణీ సమయంలో తోపులాటలు జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంటుంది.
- సంగారెడ్డి రూరల్ : సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖానపేటలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.
- నిజాంపేట : మండలంలోని కల్వకుంట గ్రామంలో ఒక్కొక్కరికి ఒక యూరియా బస్తాను అందజేశారు. నార్లపూర్ గ్రామంలో యూరియా పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు.
- కొండాపూర్ : కొండాపూర్ పీఏసీఎస్ ముందు రైతులు బారులు తీరారు. యూరియా లారీ వచ్చిందని సమాచారం అందడంతో 10 గ్రామాల రైతులు ఒక్కసారిగా రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



చేర్యాల రైతువేదిక వద్ద పారబోసిన పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లను వెతుక్కుంటున్న రైతులు

- చేగుంట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండల కేంద్రంలో ఉదయం నుంచి మహిళలు, రైతులు భారీ సంఖ్యలో యూరియా కోసం క్యూలో నిలబడ్డారు.
- నంగునూరు : నంగునూరు మండలానికి యూరియా లారీలు వస్తున్నాయని తెలియడంతో, తెల్లవారుజామునే వందలాదిమంది రైతులు ఆగ్రో సేవా కేంద్రం ముందు బారులు తీరారు. గంటల తరబడి నిలబడలేక తమ పాసుపుస్తకాలను, కొందరు చెప్పులను లైన్‌లో పెట్టి నిలబడ్డారు.
- చేర్యాల : చేర్యాల పట్టణంలో గత శనివారం పలువురు రైతులకు యూరియా అందించినప్పటికీ స్టాక్ లేకపోవడంతో మరికొందరికి టోకెన్లు ఇవ్వలేదు. మరుసటి రోజున టోకెన్లు ఇస్తామని సిబ్బంది చెప్పడంతో రైతులు తమ పాసుపుస్తకం ప్రతులు ఇచ్చి వెనుదిరిగారు. కానీ రెండు రోజులు గడిచిపోవడంతో సిబ్బంది ఆయా రైతుల పట్టాదారు పాసుపుస్తకాల ప్రతులను రైతువేదిక ఆవరణలో పారబోశారు. మంగళవారం టోకెన్లు ఇస్తున్నారని సమాచారం అందడంతో అధిక సంఖ్యలో రైతులు వచ్చారు. బయట పారబోసిన పాసుపుస్తకం ప్రతులు కనిపించడంతో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తీరుపై మండిపడ్డారు. పలువురు రైతులకు టోకెన్లు జారీ చేసినా, ఆయా కేంద్రాల వద్ద యూరియా లేదని వెనక్కి పంపించడంతో గందరగోళం నెలకొంది.
- మిరుదొడ్డి : మిరుదొడ్డి రైతువేదిక వద్ద సోమవారం అర్ధరాత్రి నుండే బారులు తీరారు. దీంతో క్యూ లైన్‌లో నిలబడే ఓపిక లేక కట్టెలు, ఇటుకలు, రాళ్లను క్యూలో పెట్టారు. అంతేకాకుండా యూరియా ఎప్పుడు వస్తుందోనని ఆశతో రాత్రి అక్కడే నిద్రించారు. అక్బర్‌పేట-భూంపల్లిలో కూడా రైతులు యూరియా కోసం నానా ఇబ్బందులు పడ్డారు.
- కొండపాక : తెల్లవారుజాము నుంచే పలు గ్రామాల రైతులు కొండపాకకు చేరుకొని వరుసలో నిలబడ్డారు.
- హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలోని మన ఆగ్రోస్ వద్దకు రైతులు తెల్లవారుజామునే తరలివచ్చారు. చెప్పులు క్యూలో పెట్టి ఒక బస్తా కోసం పడిగాపులు కాశారు.



హుస్నాబాద్ మన ఆగ్రోస్ దుకాణం వద్ద గంటలతరబడి నిలబడలేక లైన్‌లో పెట్టిన చెప్పులు



నంగునూరులో యూరియా కోసం ఆగ్రో సేవా కేంద్రం వద్ద...

జై బోలో గణేష్ మహరాజ్‌కీ..

స్వాతంత్ర్య ఉద్యమం నుంచే వినాయక ఉత్సవాలు



కోహీర్‌లో సర్వజనిక వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోహీర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో వినాయక ఉత్సవాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. స్వాతంత్ర్య సమర ఉద్యమ కాలం నుంచే, అంటే గత 82 సంవత్సరాలుగా కోహీర్‌లో వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సంప్రదాయాన్ని 1943లో కోహీర్‌కు చెందిన కవేల్లి సిద్ధప్ప, లింగాల బస్వన్నప్ప, శంకర్‌రావ్ దేశపాండేలు కలిసి వినాయక మండలిని స్థాపించి ప్రారంభించారు. వారి తర్వాత ముద్దడి జనార్దన్ రెడ్డి సుమారు 35 సంవత్సరాల పాటు ఉత్సవాల బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం కొత్త కాపు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 'సర్వజనిక్ వినాయక మండలి' 82వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఏటా ఎంతో ఆనందంగా, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వినయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గత రెండేళ్లుగా మట్టి గణనాథుడిని ప్రతిష్ఠిస్తున్నామని చెప్పారు.

40 ఏళ్లుగా సరాఫ్‌పల్లిలో ఒకే వినాయకుడు



సరాఫ్‌పల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుడు

పుల్కల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో ఒక అరుదైన సంప్రదాయం కొనసాగుతోంది. గత 40 ఏళ్లుగా గ్రామస్థులందరూ కలిసి ఒకే ఒక్క వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు, యువజన సంఘాల తరపున పలు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న ఈ రోజుల్లో, సరాఫ్‌పల్లిలో ఈ ఏకత్వ సంప్రదాయం ఆదర్శప్రాయంగా నిలిచింది.

రేగోడులో పదేళ్లుగా మట్టి గణపతి



రేగోడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేగోడు పట్టణంలో గత పదేళ్లుగా మట్టి గణపతిని పూజిస్తున్నారు. 'నోబెల్ యూత్' ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద, అలాగే వీరశైవ లింగాయత భవనం వద్ద మట్టి వినాయకులను ప్రతిష్ఠిస్తున్నారు. ఈ సంవత్సరం పది అడుగుల భారీ మట్టి వినాయకుడిని ఆన్‌లైన్‌లో బుక్ చేసి తెప్పించారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడమే మోక్షమని భక్తులు బావిస్తున్నారు.

మత సామరస్యం చాటిన ముస్లిం యువకుడు

అదే సమయంలో, రేగోడులో మత సామరస్యం వెల్లివిరిసింది. రేగోడుకు చెందిన ముస్లిం యువకుడు కటికే ఖాజామియా, టెంట్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు. గణేశ్ మండలి సభ్యులు ఖాజామియాను సత్కరించారు.

సరస్వతి అలంకరణలో గణపతి



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణంలోని పటేల్‌పుర వీధిలోని శ్రీ పార్వతి మాత ఫ్యామిలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వినాయకుడు సరస్వతి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. వెయ్యి పెన్నులు, 9 వందల పుస్తకాలతో గణపయ్యను అలంకరించారు.

గణేషుడికి చప్పన్‌భోగ్



మెదక్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) మెదక్ పట్టణంలోని మిలిట్రీ కాలనీలో గణనాథుడికి మంగళవారం 56 వంటకాలు (చప్పన్ భోగ్) నివేదన సమర్పించారు. పిండివంటలు, పాయసం, పులిహోర, స్వీట్లు, లడ్డూ, వడలు తదితర నైవేద్యాలు పెట్టి కొలిచారు.



భగ్గుమంటున్న కూరగాయల ధరలు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో స్థానిక మార్కెట్‌కు కూరగాయల సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. వ్యాపారులు మహారాష్ట్రలోని షోలాపూర్, పుణే వంటి దూర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. ఫలితంగా ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి, దీంతో ప్రజలు వాటిని కొనలేక ఇబ్బందులు పడుతున్నారు.

రూ.60 నుంచి రూ.100..

వర్షాల వల్ల పొలాల్లో నీరు చేరి రైతులు, కూలీలు పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో కాసిన కూరగాయలను కూడా కోయలేకపోతున్నారు. ఈ కారణంగా స్థానికంగా పండే కూరగాయల లభ్యత చాలా తక్కువగా ఉంది. కొన్ని రోజుల క్రితం కిలో రూ.40 ఉన్న కూరగాయలు ఇప్పుడు రూ.60 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. గతంలో కిలో రూ.20 ఉన్న టమాటా ప్రస్తుతం రూ.50 పలుకుతున్నది. అలాగే బెండ, దొండ, వంకాయ, క్యారెట్, ఆలుగడ్డ రూ.60, చిక్కుడు, బీర రూ.80, బుడమ రూ.100, పచ్చిమిర్చి రూ. 60 నుంచి రూ.80, పాలకూర, మెంతి కూర రూ.100 పలుకుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వస్తున్న కూరగాయల నాణ్యత కూడా అంతగా ఉండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఈ పరిస్థితికి వర్షాలే ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

సింగూరు.. రెండు గేట్లు మూసివేత

పుల్కల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం తగ్గుతుండటంతో నీటి పారుదల శాఖ అధికారులు రెండు గేట్లను మూసివేశారు. మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఎగువ నుంచి 80,960 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అప్పటివరకు ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రవాహం తగ్గడంతో మధ్యాహ్నం 2 గంటలకు ఐదో గేటును, సాయంత్రం 4 గంటలకు ఆరో గేటును మూసివేశారు. ప్రస్తుతం 8, 9, 10, 11, 15వ గేట్ల ద్వారా వరద నీరు దిగువకు వెళ్తోంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 54273 క్యూసెక్కులుగా నమోదైంది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పడుతోందని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 521.570 మీటర్ల ఎత్తు వరకు 20.185 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పెద్దశంకరంపేట టూ కాశ్మీర్ సైకిల్ యాత్ర



రాంచందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటకు చెందిన రాంచందర్ మంగళవారం పేట రామాలయం నుంచి కాశ్మీర్‌లోని అమ్మవారి దర్శనం కోసం సైకిల్ యాత్ర ప్రారంభించారు. గతంలో తాను రాజస్థాన్‌లోని ఇగ్లాంజ్ దేవి అమ్మవారికి ఇక్కడ నుంచి తీసుకెళ్లిన త్రిశూలాన్ని సమర్పించినట్లు వివరించారు. అనంతరం కాశ్మీర్‌లో పలు దేవాలయాలను సందర్శించినట్లు చెప్పారు. రాంచందర్ అయోధ్యకు కూడా సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ప్రారంభానికి ముందు రాంచందర్‌ను గ్రామ పెద్దలు గంగారెడ్డి, వీరప్ప, సత్యం, మహేష్, రాము తదితరులు సన్మానించారు.

కల్వర్టులు.. కష్టాలు

- వరదొస్తే లో లెవల్ వంతెనలు దాటలేని పరిస్థితి
- రోజులతరబడి రాకపోకలు బంద్

సిద్దిపేట రూరల్/దౌల్తాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, దౌల్తాబాద్ మండలాల్లోని పలు గ్రామాలకు లో లెవల్ కల్వర్టులు ప్రజలకు శాపంగా మారాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు వరదలు పోటెత్తి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీదేవిపల్లి-నారాయణరావుపేట రోడ్డులో రెండు వాగుల వద్ద లో లెవల్ కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

సిద్దిపేట రూరల్ మండలంలో..

లోలెవల్ వంతెనలతో నారాయణరావుపేట మండల కేంద్రానికి వెళ్లాలంటే అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లి-నారాయణరావుపేట, నారాయణరావుపేట-బంజేరుపల్లి, గుర్రాలగొంది-నారాయణరావుపేట గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ కల్వర్టులతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, చింతమడక, అంకంపేట గ్రామాల్లోని చెరువులు నిండినప్పుడు వచ్చే వరద నీరు లక్ష్మీదేవిపల్లి వాగులో లో లెవల్ కల్వర్టు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో లక్ష్మీదేవిపల్లితో పాటు ఇతర గ్రామాలకు రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా, పనులు ప్రారంభం కాకపోవడంతో నిధులు ల్యాప్స్ అయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వరదల కారణంగా రైతుల పంటలు కూడా దెబ్బతింటున్నాయి. అలాగే బంజేరుపల్లి, ఇబ్రహీంపూర్, కోదండరావుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు నారాయణరావుపేట వెళ్లాలంటే 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సాధారణంగా 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లడానికి వరదలు తగ్గేంత వరకు వేచి ఉండాలి లేదా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తున్నది.

దౌల్తాబాద్ మండలంలో..

దౌల్తాబాద్ మండలంలో కూడా లో లెవల్ వంతెనల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే వంతెనలు మునిగిపోయి రవాణాకు ఆటంకం ఏర్పడుతోంది. గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో గోవిందాపురం సమీపంలో ఉన్న వంతెన చిన్నపాటి వర్షాలకే మునిగిపోతుంది. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా, ఇతర పనుల కోసం వెళ్లాలన్నా వీలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. గాజులపల్లిలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ వంతెన వర్షానికి సగం కొట్టుకుపోయింది. దీంతో రైతులు పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లడం కష్టంగా మారింది. వరద వచ్చినప్పుడు గ్రామంలోని ఇళ్లలోకి కూడా నీరు చేరుతుందని ప్రజలు చెబుతున్నారు. దొమ్మాట నుంచి సిద్దిపేటకు వెళ్లే మార్గంలో ఉన్న లో లెవల్ వంతెనపై వరద ఉధృతి అధికంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారంగా హై లెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులు, పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



దౌల్తాబాద్:దొమ్మాటలో సిద్దిపేటకు మార్గంలో వంతెనపై నుంచి వరద..

సత్రం దాత.. సుఖీభవ

- మలన్న ఆలయంలో 100 గదుల సత్రం
- 5 అంతస్తుల్లో నిర్మాణానికి నిర్ణయం
- స్థలం కేటాయింపు.. దాతలకు ఆహ్వానం
- ఇప్పటివరకు ఆరుగురు రూ.15లక్షల చొప్పున అందజేత
- త్వరలో పనుల ప్రారంభానికి సన్నాహాలు

కొమురవెల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.17 కోట్ల అంచనా వ్యయంతో 100 గదుల సత్రం నిర్మించాలని దేవస్థానం పాలకవర్గం నిర్ణయించింది. ఈ నిర్మాణానికి దేవస్థానం నిధులతో పాటు దాతల సహకారం కూడా తీసుకోనున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఒక ఎకరం స్థలాన్ని ఎంపిక చేశారు. ఇప్పటికే మట్టి పరీక్షలు పూర్తయ్యాయి, భవనం నమూనాకు కూడా ఆమోదం లభించింది. ప్రస్తుతం పరిపాలనాపరమైన అనుమతులు రావాల్సి ఉంది.



100 గదుల సత్రం నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం

ఐదు అంతస్తుల్లో వంద గదుల నిర్మాణం

ఈ సత్రం నిర్మాణాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తుల్లో చేపట్టనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో దేవస్థానానికి ఆదాయం వచ్చేలా షాపులు, వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. మిగతా ఐదు అంతస్తుల్లో మొదటి అంతస్తును రూ.5 కోట్లతో దేవస్థానం నిధుల ద్వారా నిర్మించనున్నారు. మిగిలిన నాలుగు అంతస్తులను దాతల సహకారంతో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 100 గదుల సత్రం, అలాగే బండగుట్టపై ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 50 గదుల సత్రం అందుబాటులోకి వస్తే భక్తులకు వసతి సమస్య చాలా వరకు తీరుతుంది.

పనులు మొదలైతే దాతల సహకారం..

సత్రం నిర్మాణానికి సుమారు 80 మంది దాతలు అవసరం ఉండగా, ఇప్పటివరకు ఆరుగురు దాతలు ఒక్కొక్కరు రూ.15 లక్షల చొప్పున చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. మరో 15 మంది దాతలు ఆసక్తి చూపిస్తున్నారని వారు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఒక సామాజిక వర్గం వారు రెండో అంతస్తును పూర్తిగా తామే నిర్మిస్తామని చెప్పినట్లు సమాచారం. నిర్మాణ పనులకు త్వరగా శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభిస్తే మరింత మంది దాతలు ముందుకు వచ్చే అవకాశం ఉందని ఆలయాధికారులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలోనే శంకుస్థాపన



100 గదుల సత్రం నిర్మాణానికి స్థలం ఎంపిక, మట్టి పరీక్షలు పూర్తయ్యాయని ఆలయ అధికారులు తెలిపారు. బిల్డింగ్ ప్లానింగ్‌కు కూడా అనుమతి లభించిందని, ఇప్పటివరకు ఆరుగురు దాతలు రూ.15 లక్షల చొప్పున చెక్కులు అందించగా, ఇంకా మరింతమంది దాతలు ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే శంకుస్థాపన చేసే అవకాశం ఉందని, వెంటనే దాతలు ముందుకు వచ్చి ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు బియ్యం వేలం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్ర జ్యోతి): నారాయణరావుపేట మండల కేంద్రంలోని బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానంలో దాతలు అందజేసిన బియ్యాన్ని బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్లు దేవస్థానం చైర్మన్ బాగన్న కరుణాకర్ ముదిరాజ్, ఈవో కోమ్మెర శ్రీధర్ రెడ్డిలు తెలిపారు. ఆసక్తి కలవారు ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్దకు వచ్చి వేలంలో పాల్గొనాలని కోరారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సిద్దిపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిమజ్జనం కొరకై వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు బైపాస్ రోడ్డు వైపున నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విగ్రహాలు నిమజ్జనం చేయుటకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని, భక్తులు ఎవరూ నేరుగా చెరువు వద్దకు వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయరాదన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గజ్వేల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. గజ్వేల్‌లోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, నూతన చట్టాలు, మోటార్ సైకిల్ యాక్ట్, భరోసా, స్నేహిత, డయల్-100లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షీటీమ్ ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో హరితహారంలో భాగంగా ఆయన మొక్కలను నాటారు.

డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత

చిన్నకోడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి) : డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను యువతకు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మంగళవారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రగ్స్ మూలంగా సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను యువతకు వివరించారు. అంతకు ముందు ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

గంజాయి, ఇతర మత్తు పదార్థాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సైఫ్ అలీ సూచించారు. చిన్నకోడూరులో మంగళవారం నార్కోటిక్స్ డాగ్స్‌తో కిరాణ షాపులు, అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీ చేశారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు

చిన్నకోడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి) : మొక్కజొన్న సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త (తోర్నాల) డాక్టర్ పల్లవి, మొక్కజొన్న పరిశోధన కేంద్రం (రాజేంద్రనగర్) శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ శ్రావణి, డాక్టర్ అనూష మంగళవారం చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. ఇటీవల వర్షాలకు మొక్కజొన్న పంటను పాము పొడ తెగులు ఆశించినట్లు తెలిపారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన రక్షణ చర్యలను గూర్చి శాస్త్రవేత్తలు వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల వద్ద విద్యార్థులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.

చినుకు పడితే చిత్తడే

- చిన్నకోడూరులో నాలుగు లేన్ల రోడ్డు దుస్థితి
- రెండేళ్ల క్రితం మట్టి పోసి వదిలేశారు
- చిన్న వర్షానికే గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారిన రహదారి
- అదుపు తప్పి గాయాలబారిన పడుతున్న వాహనదారులు
- రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని డిమాండ్



చిన్నకోడూరులో ప్రధానరహదారిపై గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారిన రోడ్డు

చిన్నకోడూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా చిన్నకోడూరులోని స్థానిక వివేకానంద విగ్రహం సమీపం నుంచి గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపం వరకు 1 కిలో మీటరు మేర సుమారు రెండేళ్ల క్రితం పాత బీటీ రోడ్డును తొలగించి మట్టి పోసి వదిలేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఆ రోడ్డు పై గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో వర్షం నీరు చేరి రోడ్డు బురదమయంగా మారింది,

వాహనదారుల ఇక్కట్లు

ఆ రోడ్డు గుండా వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పై గుంతలు ఏర్పడి బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షానికి రోడ్డు చిత్తడిగా మారి వాహనాలు దిగబడుతున్నాయని, రోడ్డు పై ఏర్పడిన గుంతలలో వాహనాల టైర్లు పడి వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు వెంట రాకపోకలు సాగించాలంటే వాహనదారులు జంకే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి రోడ్డు ఇలా..



కొమురవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందున్న రోడ్డు బురదమయంగా మారడంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో బురదలో నుంచే వెళ్లక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రి ముందు ఉన్న రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొమురవెల్లి, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి)

మొక్కలను పరిరక్షించాలి: గరీమా అగ్రవాల్



సిద్దిపేట అర్బన్: మిట్టపల్లి ప్రధాన రహదారి పక్కన మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట అర్బన్/కొండపాక/హుస్నాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోయిన చోట తిరిగి మళ్లీ మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వెంట డీఆర్డీవో జయదేవ్ ఆర్య, ఎంపీడీవో మార్టిన్ లూథర్, ఏపీవో రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు. అదేవిధంగా కొండపాక మండలం దుద్దెడలోని బీసీ కాలనీ మంగళవారం అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ మంగళవారం సందర్శించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా డ్రై డే పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లలో నీటి నిలువలను పరిశీలించారు. వెంట జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, అధికారులు ఉన్నారు. సాయంత్రం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఇంజనీరింగ్ అధికారులున్నారు.

దుద్దెడలో టీఎల్ఎం మేళా ప్రారంభం



కొండపాక: ఉపాధ్యాయులు తయారుచేసిన టీఎల్ఎంను పరిశీలిస్తున్న డీఈవో

కొండపాక/కొమురవెల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లో కాస్ట్, నో కాస్ట్‌తో తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఆలోచింప చేసే విధంగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మండలస్థాయి టీఎల్ఎం మేళాను డీఈవో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో టీఎల్ఎం ఉపయోగిస్తూ బోధన సాగితే వారిలో భాషా నైపుణ్యం పెంపొందుతుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు వివిధ రకాల టీఎల్ఎం లను తయారు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఎంఎన్‌వో పెద్ది విఠల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండలంలోని పాఠశాలల పాధ్యాయులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించి వారితో మాట్లాడారు. అనంతరం పాఠశాలలోని వంటగదిని, పరిసరాలను పరిశీలించారు.

అవినీతి అనకొండలకు జలాభిషేకమా?

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



తొగుటలో మాజీ మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొగుట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో వేల కోట్ల అవినీతికి పాల్పడిన అనకొండలకు మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద బీఆర్ఎస్ నేతలు జలాభిషేకం చేయడం సభ్య సమాజం సిగ్గుపడుతున్నదని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం తొగుట ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్‌లోకి నేడు నీళ్లు వస్తున్నాయంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్ ద్వారానే అని స్పష్టం చేశారు. తోటపల్లి రిజర్వాయర్‌ను నిర్వీర్యంచేసింది అప్పటి బీఆర్ఎస్‌కు చెందిన మంత్రి హరీశ్‌రావు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. తోటపల్లి సమీపంలో నిర్మించిన రిజర్వాయర్‌లో కావేరి సీడ్స్‌కు చెందిన 110 ఎకరాలు పోకుండా డబ్బులు తీసుకుని కాపాడింది హరీశ్‌రావు, కొత్తప్రభాకర్‌రెడ్డి కాదా అని మండిపడ్డారు. అదే విధంగా కుకునూర్‌పల్లిలో కూడా లంచం తీసుకుని తొగుటలో మల్లన్నసాగర్ నిర్మాణం జరిగేలా చూడటం వాస్తవం కాదా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి గతంలో నీరు పంపింగ్‌చేస్తే నేడు మిడ్ మానేరు నుంచి మల్లన్నసాగర్‌కు నీరును పంపింగ్ చేస్తున్నామన్నారు. అమరుల పేరు చెప్పుకొని తెలంగాణ సంపదను దోచుకున్నవారిని తరిమేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, దుబ్బాక నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయ్‌రెడ్డి, నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, ఉప్పలయ్య, మహిపాల్‌రెడ్డి, రవిందర్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తొగుటలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకుని కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతికి పాల్పడిన మాజీమంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

● **సిద్దిపేట:** కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ నిజానిజాలు నిగ్గుదేల్చాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కల్వకుంట్ల కుటుంబం కోట్లాది రూపాయలు దోచుకొని, తెలంగాణ ప్రజలను నట్టేట ముంచారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని గణేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, మందపల్లి సంపత్, పిల్లి బాబు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించడం సరైన చర్యేనని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లోని మెయిన్ రోడ్డులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సీబీఐతో నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలి



దుకాణదారులకు శిక్షణ ఇస్తున్న భార్గవి

కొండపాక, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకురాలు భార్గవి పేర్కొన్నారు. మంగళవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో దుకాణదారులు హోటల్ వ్యాపార నిర్వాహకులకు ఎంసీఈడీ (మహారాష్ట్ర సెంటర్ ఫర్ ఆంత్రపెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్) వారి ఆధ్వర్యంలోశిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకురాలు భార్గవి అవగాహన కల్పించారు. దుకాణ వ్యాపార యజమానులు ఆహార భద్రత శిక్షణ పొంది వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలన్నారు. దుకాణ వ్యాపార సముదాయాలలో శుచి శుభ్రత పాటించాలని, హోటల్ నిర్వాహకులు ఆహార పదార్థాలలో ఫుడ్ కలర్స్, టెస్టింగ్ సాల్ట్ వినియోగించరాదని తెలిపారు. హోటల్స్, దుకాణ సముదాయాలలో ఆహార పదార్థాలను పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దుద్దెడ గ్రామపంచాయతీ సెక్రటరీ చక్రపాణి, ఎంసీఈడీ రీజనల్ కోఆర్డినేటర్స్ శ్రీనివాస్, మహేందర్ రెడ్డి జిల్లా కోఆర్డినేటర్ రవి, సిబ్బంది రాకేష్ భూపాల్, భానుచందర్, శరత్, వినయ్, రంజిత్, రమేష్ పలువురు దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై కవిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా



కవిత ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావు, సంతోష్‌రావులపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కవితకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆమె ఫ్లెక్సీలను దహనం చేశారు. అంతకు ముందు మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ జరిపారు. కవిత తనపై ఉన్న కేసులు మాఫీ చేసుకోవడానికి బీజేపీకి అమ్ముడు పోయి వారు చెప్పినట్లుగా చేస్తుందని ఆరోపించారు. ఇక నుంచి పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తే గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత,నాయకులు ఉన్నారు.

సీబీఐకి సిఫార్సు చేయడం కక్షసాధింపు చర్యే



నంగునూరు మండలం పాలమాకుల బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట/ నంగునూరు/కోహెడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి):మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నంగునూరు మండలం పాలమాకులలోని సిద్దిపేట- హనుమకొండ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన సందర్భంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కోహెడ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను నిరసించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా డ్రైడే

సిద్దిపేట రూరల్/జగదేవ్‌పూర్/రాయపోల్/ ములుగు, సెప్టెంబరు 2(ఆంధ్ర జ్యోతి): జిల్లావ్యాప్తంగా మంగళవారం పలు మండలాల్లో డ్రైడే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ పాల్గొని మొక్కలు నాటారు. జగదేవ్‌పూర్ మండలంలోని అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి వినయ్‌కుమార్ పర్యటించారు. తిమ్మాపూర్‌లో మహిళా సంఘాలతో పారిశుధ్యంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. రాయపోల్ మండలంలోని రాయపోల్, కొత్తపల్లి గ్రామాల్లో శానిటేషన్, డ్రైడే కార్యక్రమాలను మండల స్పెషల్ ఆఫీసర్, గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ పరిశీలించారు. ములుగు మండల పరిధిలోని తునికిబొల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి డీపీఎం ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి రెండు మచ్చెర్‌దాన్‌లు అందజేశారు.

కాంగ్రెస్ గ్యారంటీలు ఏమయ్యాయి?



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలకు గ్యారెంటీ లేకుండా పోయిందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు 66 సబ్ గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా ఏఒక్క హామీకి గ్యారెంటీ లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వేలకోట్ల అప్పులు చేసినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. రైతులకు రూ.15 వేల రైతు భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగ రామచంద్ర రెడ్డి, రామచంద్ర రావు, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, గాడిపల్లి భాస్కర్, విభీషణ్ రెడ్డి, జస్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన అధికారిపై చర్యలు తీసుకోండి

- సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ గుండ్ల శివచంద్రం

సిద్దిపేటక్రైం సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న చిన్నకోడూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సిటిజన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ గుండ్ల శివ చంద్రం, బాధితుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. చిన్నకోడూరు మండలం మాచపూర్ గ్రామానికి చెందిన బొబ్బల తిరుపతిరెడ్డి ఏలేటి రాజిరెడ్డికి మధ్య భూ వివాదం కోర్టుకెక్కగా బొబ్బల తిరుపతి రెడ్డికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా రాజిరెడ్డి ఆ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడన్నాడని తెలిపారు. ఈ విషయంపై చిన్నకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కోర్టు తీర్పు ప్రతిని చూపించినా లెక్కచేయడం లేదన్నారు. ఫిర్యాదు చేసినట్టు కనీసం రసీదు ఇవ్వమంటే విచారణ అనంతరమే ఇస్తామంటున్నారని ఆరోపించారు. కోర్టు ఆర్డర్ లెక్కచేయని చిన్నకోడూరు ఎస్ఐపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఆర్‌సీ సభ్యులు తుమ్మ రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

అట్టహాసంగా మండలస్థాయి క్రీడలు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్/చిన్నకోడూరు/మద్దూరు/తొగుట/రాయపోల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని పలు మండలాల్లో మంగళవారం మండలస్థాయి ఎస్జీఫ్ క్రీడలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చదువుతో పాటు ఆటలు కూడా చాలా ముఖ్యమన్నారు. ఆటలతో విద్యార్థులు మానసిక, శారీరక ధృఢత్వం పెంపొందుతాయన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట అర్బన్ మండల క్రీడ పోటీలను డీఈవో శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. వెంట డీవైఎస్‌వో వెంకట నర్సయ్య, ఎంఈవో రాజప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మండల ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో మనీల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, నాయకులు, పీడీలు తదితరులు ఉన్నారు.చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను తహసీల్దార్ సలీం మియా, ఎస్ఐ సైఫ్ అలీ, ఎంఈవో యాదవరెడ్డితో కలిసి ప్రారంభించారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కల్గుతుందన్నారు. దూళిమిట్ట మండల స్థాయి క్రీడా పోటీలను మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే మద్దూరులో నిర్వహించిన క్రీడలను తహసీల్దార్ రహీం, ఎంపీడీవో రాంమోహన్, ఎంఈవో వరదరాజు ప్రారంభించారు. తొగుటలో మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాయపోల్‌లో ఎస్జీఎఫ్ క్రీడల ముగింపు సమావేశంలో ఎంఈవో సత్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. రెండురోజులుగా నిర్వహించిన ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

దివంగత సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి



సిద్దిపేటలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, కాంగ్రెస్ కార్యాలయాల్లో వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల మనస్సులో నిలిచిన మహోన్నతమైన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి)

మాజీమంత్రి ముత్యంరెడ్డికి ఘన నివాళి

తొగుట/దౌల్తాబాద్/మిరుదొడ్డి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో మంగళవారం స్వర్గీయ మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సతీమణి విజయలక్ష్మి, తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డిలు ముత్యంరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండలకేంద్రంలోని శివాజీ చౌరస్తాలో మాజీ మంత్రి ముత్యంరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బండారులాలు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మిరుదొడ్డి మండలంలోని అల్వాల చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

గ్రామాలవారీగా ఓటరు జాబితా ప్రదర్శన

మద్దూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామపంచాయతీల వారీగా ఓటరు తుది జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మద్దూరులో విలేకర్లతో మాట్లాడారు. ఓటరు తుది జాబితాలో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితాను ఆయా గ్రామపంచాయతీలలో ప్రదర్శించినట్లు తెలిపారు.

గణపయ్య నిమజ్జనానికి గ్రహణం ఎఫెక్ట్

(5వ పేజీ తరువాయి)

చేశారు. వీటిలో ఈ నెల 5న 559 విగ్రహాలను, 6వ తేదీన అత్యధికంగా 1647 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా, నిమజ్జన మార్గాలను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

శాస్త్రం, ధర్మం పాటిస్తేనే ఫలితం



ఆదివారం మధ్యాహ్నం నుంచే గ్రహ వేదన మొదలవుతుంది. కాబట్టి శనివారం వరకే నిమజ్జన ప్రకియ పూర్తి చేసుకుంటే మంచిది. శాస్త్రం, ధర్మం ప్రకారం ఆధ్యాత్మిక క్రతువులు నిర్వహిస్తేనే శుభ ఫలితాలు ఉంటాయి. అలా కాదని సెలవులని, తమకు అనుకూలంగా ఉన్న రోజులని వీలును బట్టి కాకుండా శాస్త్ర ప్రకారం 9 రోజులు పూజాదికాలు పూర్తవ్వగానే నిమజ్జనం చేయాలి.

- పొడిచేటి రామకృష్ణాచార్యులు, వేద పండితుడు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొండపాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ అమ్ముల బాల నరసయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొండపాక ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాల చెల్లించాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం ఎంపీడీవో వెంకటేశ్వర్లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

కోహెడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కోహెడలో ఆశ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సింగిరెడ్డి చెంద్రారెడ్డి కాటం మధు, అశోక్, విష్ణు, ఆశా యూనియన్ మండల అధ్యక్షులు శ్రీజ్యోతి, రజిత, రాజమణి పాల్గొన్నారు.